## జిల్లా ఎస్పీని కలిసిన సిపిఐ నేతలు


జిల్లా ఎస్పీని కలిసిన సిపిఐ నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 12 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను సిపిఐ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి సిపిఐ నాయకులు కలిసి ప్రజాసమస్యలపై చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రహమాన్, కార్య వర్గ సభ్యులు ఎండి మహబూబ్‌ఖాన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివశంకర్, అనురాధ, ఎల్ వేణు గోపాల్ ఎం లక్ష్మణ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త


## పెద్దాపూర్ పెద్ద చెరువులో మొసలి ప్రత్యక్షం


పెద్దచెరువలో మొసలి

**అల్లాదుర్గం, నవంబరు 12, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువు గట్టున బుధవారం మొసలి కానరావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చెరువు పక్కన మేకలు, పశువులను మేపుతున్న పశువుల కాపరులు చెరువలో మొసలిని గుర్తించి గ్రామస్థులకు సమాచారం చేరవేడయంతో ప్రజలు చెరువు వద్దకు చేరుకుని చేసిన శబ్దాలకు మొసలి చెరువులోకి జారుకుంది. చెరువలో మొసలిని మొదటి మారు చూశామని మత్స్యకారులు, గ్రామస్థులు చర్చించుకోవడం కానవచ్చింది. చెరువు వైపు ఎవరూపోవద్దని గ్రామస్థులు తీర్మానించుకున్నారు. చెరువులోకి మొసలి ఎటువైపు నుంచి వచ్చిందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

## సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి

**కొండాపూర్, నవంబరు 12(ప్రభాతవార్త):** గ్రామాల ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అలియాబాద్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి 20లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులకు బుధవారం భూమి పూజ చేశారు. అదేవిధంగా కొండాపూర్ గొల్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మెన్ వై.ప్రభు, మార్కెట్ కమిటీ,కుమార్, సొసైటీ చైర్మెన్లు మాణిక్‌రెడ్డి, ఎల్.శ్రీకాంత్రెడ్డి, తహసీల్దార్ ఆశోక్, ఎఓ గణేశ్, కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, ప్రభుదాస్, నర్సింలు, సతీష్ ముదిరాజ్ జోగన్నగారి ప్రవీణ్ కుమార్, అలియాబాద్ మాజీ సర్పంచ్ ఫహీం, పంచాయితీ కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల దినోత్సవం విజయవంతం చేయండి

### జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న లలితా కుమారి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 12, ప్రభాతవార్త :** నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలితాకుమారి మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలలో సీనియర్ సిటిజన్స్ పాల్గొనాలని కోరారు. తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, సీనియర్ సిటిజన్ కోసం ఏర్పాటు చేయబడిందని తెలియజేశారు. ఈ సంక్షేమ చట్టం గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సమాజంలో తల్లిదండ్రులు పిల్లల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలకు వృద్ధుల పోషణ, సంరక్షణకు ప్రత్యేకమైన టోల్ ఫ్రీ నెంబర్ 14567 ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబర్‌ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ సూర్యరావు, వయో వృద్ధుల, దివ్యాంగుల శాఖ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, వయోవృద్ధులు మరియు దివ్యాంగులు,ట్రాన్స్ జెండర్స్ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్,జిల్లా బాలల సంరక్షణ అధికారి రత్నం కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమేరా సహిష్ట, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు విజయ రావు, అశోక్ కుమార్ సంగయ్య కృష్ణ సత్తయ్య నరసింహారెడ్డి, ఖాదర్ మైనుద్దీన్ పాల్గొన్నారు

## 14న మెదక్‌లో బిజెపి పాదయాత్ర



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేశం గౌడ్

**మెదక్ టౌన్, నవంబరు 12, ప్రభాతవార్త:** పట్టణంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో బుధవారం నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14వ తేదీన మెదక్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్ర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి రాందాస్ చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాల కతీతంగా ప్రతి ఒక్కరూ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంపై శ్రద్ధ తీసుకోవాలి

### బాలల హక్కుల ప్రొటెక్షన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సరిత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
రాష్ట్ర బాలల హక్కుల ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు గోగుల సరిత బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి ఎండిఎం మెనూ ప్రకారం ఉన్నాయో లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. వంట గదిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 9వ తరగతి విద్యార్థులను మధ్యాహ్న భోజనంపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సాయంత్రం పాఠశాలలో బయటివారు వచ్చి విద్యార్థినీలకు ఇబ్బందులను కలిగిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని పోలీసు ప్రొటెక్షన్ తీసుకోవాలన్నారు. బాలల హక్కుల అవశ్యకతను వివరించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనకు ఫిర్యాదుచేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శారద, హెచ్ఎం నీలకంటి మనోహర్, ఎండిఎం ఇన్‌చార్జి ఎస్.ఎం.సిద్దేశ్వర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలల హక్కుల ప్రొటెక్షన్ రాష్ట్రకమిటీ సభ్యురాలు సరిత

# దేశ సమైక్యతకు ప్రతీక సర్దార్ వల్లభాయ్ పటేల్

### ఎంపి రఘునందన్‌రావు

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 12 ప్రభాతవార్త**
దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డిలో ఐక్యత మార్చ్ ఘనంగా జరిగింది. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'సమైఖ్య భారత్' సంస్థ సమన్వయంతో ఐబి నుండి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు.ఎంపీ రఘునందన్‌రావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య,అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వందేమాతరం 'జైహింద్'నినాదాలతో నగరం మార్మోగింది. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రములో ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌తో పాటు దేశానికి స్వాతంత్రం సిద్ధించిన 100వ సంవత్సరం 2047 వరకు భారత దేశాన్ని విశ్వగురువుగా నిలపాలని లక్ష్యసాధనతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు ప్రతీక అని, ఆయన చూపిన మార్గంలో యువత నడవాలని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ సర్దార్ పటేల్ దేశ ఏకతకు, సామాజిక సమగ్రతకు చేసిన కృషి అపూర్వం అని, ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకం అని పేర్కొ న్నారు. దేశ సమగ్రతకు భావితరాలకు స్వాతంత్ర్య సంగ్రామంలో మహనీయులు చేసిన కృషిని తెలియ జెప్పడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. "భిన్నత్వంలో ఏకత్వం" భారత దేశ బలమని, మన అందరం ఈ దేశానికి వరమని గుర్తిస్తూ సమైక్యతతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తగా ఎం. రంజిత్‌రెడ్డి, జిల్లా యువజన అధికారి, ఎంవై భారత్, జిల్లా యువజన అధికారి ఖాసీం బేగ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్లు దీపికా, ప్రతిభ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎంపీ, అధికారులు విద్యార్థులు

# రణభేరి మహాసభ విజయవంతం చేయాలి

### మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

**సిద్ధిపేట ప్రభాతవార్త ప్రతినిధి**
రణభేరి మహాసభ విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో నవంబర్ 23న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం మైదానంలో జరగనున్న మాలల రణభేరి మహాసభ కరపత్రాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయలే బూరుగుల వెంకటేశ్వర్లుతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తర్వాత రోస్టర్ పాయింట్ల కేటాయింపులో 5 కేటాయించిన గ్రూప్-3లోని మాలలకు ఒకటి ఉన్న గ్రూప్-1 కులాల కంటే విద్య, ఉద్యోగాల్లో తక్కువ అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అన్యాయంపై ప్రశ్నిస్తూ, ఎస్సీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతం పెంచడం, ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు, మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్ల నిధుల కేటాయింపు, మాలల సామాజిక భవనం ఏర్పాటు వంటి డిమాండ్ల సాధన కోసం రణభేరి మహాసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సీనియర్ నాయకులు పురుషోత్తం మాట్లాడుతూ మండలాల వారీగా మాలలను చైతన్యపరచి మహాసభకు భారీగా హాజరయ్యేలా చర్యలు చేపడతామన్నా. అనంతరం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ర్యాలీగా వెళ్లి పూలమాలలు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జంజీరపు ఎల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మల విజయ్, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పాకనాటి రాజు, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు కమ్మవారి రమేష్, సంయుక్త కార్యదర్శి ఎం ఎల్లేష్, వైస్ ప్రెసిడెంట్ మెరుగు వై.ఎస్, సీనియర్ నాయకులు మంద పాండు, బొమ్మల ప్రవీణ్, దుబ్బాక అధ్యక్షుడు పాకనాటి సునీల్, పట్టణ ప్రధాన కార్యదర్శి దువల వంశీ, ఉపాధ్యక్షులు సందీప్, మధు శేఖర్, వెంకటయ్య, నరసింహులు, బొమ్మల సాయి, సుకూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


రణభేరి మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

### న్యాయమూర్తి సౌజన్య

**జహీరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి భవాని చంద్ర సూచనల మేరకు బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సంగారెడ్డిలోని శిశు గృహ, సఖి కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సౌజన్య మాట్లాడుతూ పిల్లలకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. క్రమ శిక్షణతో మసులుకుంటే భవిష్యత్తు బంగారు మయం కావడం తథ్యమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. న్యాయ సహాయానికి సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సందర్శించాలని న్యాయమూర్తి సౌజన్య సూచించారు.

## రేపు పద్మశాలి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**గజ్వేల్ టౌన్, నవంబరు 12 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంతో పాటు సాధనా శూరుల కళాప్రదర్శన, కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీ శుక్రవారం రిమ్మనగూడ సమీపంలోని మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించడం జరుగుతుందని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పద్మశాలి బంధుమిత్రులందరూ ఇట్టి కార్యక్రమాలకు హాజరై సాధనా శూరుల కళా ప్రదర్శనను తిలకించాలని అన్నారు. అనంతరం నూతన పద్మశాలి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని, తదనంతరం కార్తీక వనభోజనాల కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గాడిపల్లి అనూప్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రచార కార్యదర్శి గాడిపల్లి బలరాం, ఉపాధ్యక్షుడు సబ్బని చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి హనుమాండ్ల నాగరాజు, కోశాధికారి గుండు మల్లేశం, కార్యవర్గ సభ్యులు పెండెం వెంకటేష్, ఏడెల్లి విష్ణువర్ధన్, రాచకొండ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణువర్ధన్

## విద్యార్థులకు సామాజిక స్పృహ ఉండాలి

### ఎబివిపి రాష్ట్ర సహా సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్

**సిద్ధిపేట ప్రభాతవార్త ప్రతినిధి**
ఏబీవీపీ ఆధ్వర్యంలో నగర అభ్యాస వర్గ పేరుతో జాతీయ పునర్నిర్మాణంలో విద్యార్థులు వారి పాత్రను పోషించాలని సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏబీవీపీ ప్రాంత సహ సంఘటన మంత్రి విష్ణువర్ధన్ హాజరయ్యారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నాలన్నారు. ఏబీవీపీ కార్యకర్తలు ఆచరించే జ్ఞానం, శీలం, ఏకత నుండి ప్రతి విద్యార్థి ప్రేరణ పొందాలని, విద్యారంగ, దేశ సమస్యలపై ఆందోళనాత్మక కార్యక్రమాలు చేస్తూనే మరోపక్క నిర్మాణాత్మక కార్యక్రమాలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, ఉచిత వైద్యశిబిరాలు, బోధనా తరగతులు, మహిళలకు ఆత్మరక్షణ కోసం మెలుకువలు నేర్పించడానికి మిషన్‌సాహసి, పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని గుర్తుచేశారు. కళాశాలలో విశ్వవిద్యాలయాల్లో తిష్ట వేసిన దేశ వ్యతిరేక శక్తులను తరిమికొట్టడానికి ప్రతి విద్యార్థి పని చేయాలన్నారు. సోకార్డ్ ఆర్గనైజేషన్ సృష్టిస్తున్న కుల,మత, వర్గ భేదాల ఉచ్చులో పడకుండా జాతీయ పునర్నిర్మాణం కై విద్యార్థులంతా ఈ దేశ పౌరులుగా ఒక్కటిగా నిలిచి సమాజ సేవకై నడుము కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ విభాగ్ సంఘటన మంత్రి లక్ష్మణ్, సిద్దిపేట, మెదక్ జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి, సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్య, రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ పవన్, రాష్ట్ర వనవాసి కో కన్వీనర్ మరియు నగర కార్యదర్శి పరశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణిందర్, మృదులయ్య, సౌమ్యశ్రీతో పాటు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : ఎసిపి

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 12, ప్రభాతవార్త**
రోడ్డు ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హుస్నాబాద్ ఎసిపి సౌదారపు సంపత్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎసిపి కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల గురించి సిఐ శ్రీనివాస్‌లతోపాటు ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందిన వెంటనే సమగ్ర విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేయాలన్నారు. కేసుల పరిశోధరలో నిర్లక్ష్యం వహించవద్దని, లాంగ్ పెండింగ్ కేసులను స్టేషన్‌లో డిస్పోజల్ చేయాలన్నారు. పోలీసుల పట్ల సామాన్యులకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలని, వచ్చే ప్రతీ వారితో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్యూటీలు నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను అన్ని కోణాలలో పరిశోధన చేయాలని తెలిపారు. చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయంలో బ్లూకోర్ట్స్, పెట్రోకార్ అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. డయల్ 100కు వెంటనే స్పందించాలన్నారు. నాన్ బెయిల్ కేసుల విషయంలో సాధ్యమైనంత వరకు ఎగ్జిక్యూట్ చేయాలని వివరించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రదేశాలను సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ రోజు సాయంత్రం విజిబుల్ పోలీస్ విధులు నిర్వహించాలని, ఎంవో, అపెండెక్స్, సస్పెక్టులు, కెడిలు, డిసిలతోపాటు రౌడీలపై కదలికలను గమనించాలని చెప్పారు.
సమావేశంలో హుస్నాబాద్ డివిజన్ ఎస్ఐలు పాకాల లక్ష్మారెడ్డి, పుల్ల అభిలాష్, ప్రశాంత్‌రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎసిపి సౌదారపు సదానందం


సింగూరు కబ్జాభూమిని పరిశీలిస్తున్న అధికారులు

## కబ్జా భూమిని పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

**మునిపల్లి, నవంబరు 12 (ప్రభాతవార్త):**
మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి, మల్లికార్జునపల్లి శివారులోని మల్లారెడ్డిపేట సమీపంలో కబ్జాకు గురైన ముంపు భూమిని ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. డిఈ నాగరాజ్, ఏఈ అఖిలలు మాట్లాడుతూ సింగూర్ ప్రాజెక్టో ముంపునకు గురైన భూ రికార్డులను పరిశీలించాల్సి ఉంటుందన్నారు. 393, 392 సర్వే నెంబర్‌లలో 10ఎకరాల వరకు సింగూర్ ప్రాజెక్ట్ ముంపులో ఉందన్నారు. భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సర్వే చేస్తామన్నారు. అధికారులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని అందుకే నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. కాగా భూమి యాజమని వస్తేనే సమస్య పరిష్కరం అవుతుందన్నారు.

## స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

**కొమురవెల్లి, నవంబరు 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కొయ్యడ ఎల్లయ్య(57) బ్రతుకుదెరువు కోసం సౌదీ అరేబియాకు వెళ్లారు. ఈ క్రమంలో 18 రోజుల క్రితం సౌదీలో ఎల్లయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహం స్వదేశానికి తీసుకరావాలని కోరగా బుధవారం మృత దేహన్ని సౌదీ నుంచి స్వగ్రామమైన కిష్టంపేటకు తెప్పించారు. ఎల్లయ్య మృతదేహాన్ని చూసిన కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు బోరున విలపించారు.

## నకిలీ విలేకరిపై కేసు నమోదు

**కోహెడ, నవంబరు 12, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని చిరువ్యాపారులకు వడ్డీకి డబ్బులు ఇస్తూ వ్యాపారం చేస్తున్నావని తనకు డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు గురిచేసిన నకిలీ విలేకరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం...సిద్దిపేట పట్టణానికి చెందిన పొన్నాల సంజీవ్ ప్రెస్ రిపోర్టన్‌ను, డబ్బులు ఇవ్వాలని నాలుగు రోజులుగా ఫోన్‌చేసి దుర్గారాంబాబును బెదిరింపులకు గురిచేస్తున్నాడని తెలిపారు.తనకు డబ్బులు ఇవ్వకుంటే పేపర్‌లో రాస్తా అని వాట్సాప్ ద్వారా ఫోన్‌చేసి బెదిరింపులకు గురిచేస్తున్నాడని, దుర్గారాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నకిలీ రిపోర్టర్ పొన్నాల సంజీవ్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు. ఎవరైనా బెదిరింపులకు గురి చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## లారీని దోచుకున్న దారి దోపిడీ దొంగలు

### -రూ. 20 లక్షల విలువైన సామాగ్రి తస్కరణ

**న్యాల్‌కల్, నవంబరు 12, ప్రభాతవార్త:** జహీరాబాద్-బీదర్ రోడ్డు మండల పరిధిలోని గంగ్వార్ గ్రామ శివారులో దారి దోపిడీ దొంగలు ఏకంగా లారీలోని 20 లక్షల విలువగల సామాగ్రిని దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...కర్ణాటకలోని బీదర్ పట్టణం గుండా గుజరాత్ వెళుతున్న లారీలో ముగ్గురు డ్రైవర్లను దొంగల ముఠా లారీని అడ్డగించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి మరో లారీలోకి 20లక్షల విలువైన పాన్‌మసాలా, గుట్కా పాకెట్లను మార్చి ఎత్తుకుపోయారు. హద్నూర్ పోలీసులకు లారీ డ్రైవర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలుశిక్ష

**గజ్వేల్ టౌన్, నవంబరు 12 (ప్రభాతవార్త):** పట్టణంలోని పలు ప్రాంతాలలో కొన్ని రోజుల క్రితం వాహనాలు తనిఖీ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని గుర్తించి బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీచేయగా మద్యం తాగినట్లు రిపోర్టు వచ్చిందని గ్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. వారిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరుపరచగా విచారణ చేసి ఒక వ్యక్తికి రూ.10వేల జరిమానా, ఇద్దరికి మూడు రోజులు, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**సదాశివపేట, నవంబరు 12 (ప్రభాతవార్త):** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు సిఐ వెంకటేశ్ తెలిపారు. సిఐ కథనం ప్రకారం పరాంకుశం రామానుజయ(53) ప్రైవేటు ఉద్యోగం నివాసం నరసయ్య ఆగ్రహారం గర్వవీధి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నరసయ్య భార్యను వెంటబెట్టుకొని తను పనిచేస్తున్న ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ కంపెనీ మహారాష్ట్రనుండి తిరిగి హైదరాబాద్ వస్తుండగా కారు మార్గమధ్యన ఎన్‌హెచ్ 65 రోడ్డుపై సదాశివపేట పరిధిలోగల వెంకటాపూర్ బ్రిడ్జిపైకి 12వ తేదీ తెల్లవారుజామున 2.30 గంటలకు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మరో గుర్తు తెలియని వాహనాన్ని వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామానుజయ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా భార్య అనురాధ ప్రస్తుతం చికిత్స పొందుతుంది. మృతుడు రామానుజయ కొడుకు పరాంకుశం నాగజ్యోతి నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## విద్యుత్ షాక్‌తో బర్రె మృతి

**హత్నూర, నవంబరు 12 ప్రభాతవార్త :** హత్నూర మండలం సికింద్రాపూర్ గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌తో ఒక బర్రె మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన దానంపల్లి శంకరయ్యకు చెందిన బర్రె గ్రామ సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద మేత మేస్తుండగా, తెగిపడి ఉన్న విద్యుత్ వైర్ తాకడంతో షాక్‌కుగురై మృతి చెందిందని రైతు తెలిపాడు. బర్రె విలువ రూ.50వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు దానంపల్లి శంకరయ్య కోరాడు.


విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన బర్రె



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

## చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

### త్రీ టౌన్ సిఐ విద్యాసాగర్

**సిద్దిపేట అర్బన్, నవంబరు 12, ప్రభాతవార్త :** మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని... ఈవ్ టీజింగ్ విద్యార్థులు ఆకతాయిల వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 110కు లేదా షీటీమ్ నంబరకు ఫోన్‌చేయాలని పట్టణ త్రీ టౌన్ సిఐ విద్యాసాగర్ అన్నారు. సిద్దిపేటలోని శ్రీవాణి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలు వేధింపులను నిర్లక్ష్యం చేయకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ విజయ భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమంలో షీటీం ఎఎస్ఐ కిషన్‌పవార్, కానిస్టేబుళ్లు రజిని, మమత, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ సురేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంఇవో

**చిన్నకోడూరు, నవంబరు 12, ప్రభాతవార్త :**



అందమైన చేతిరాత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అందమైన చేతిరాత కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ప్రతిరోజు 8,15 నిమిషాలకు హ్యాండ్ రైటింగ్‌పైన నిష్ణాతులైన ఉపాధ్యాయులైన నందకుమార్ ఆధ్వర్యంలో చేతి రాత కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దా లన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపిడివో, సూపరింటెండెంట్‌కు సన్మానం



ఎంపిడివో, సూపరింటెండెంట్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, నవంబరు 12, ప్రభాతవార్త :** మండల ఎంపిడిఓగా నూతనంగా విచ్చేసిన ఎంపిడిఓ బి.లక్ష్మప్ప, సూపరింటెండెంట్ రవీందర్ రావులను బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించి మాట్లాడారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు తలారి కిషన్, పచ్చిమడ్ల స్వామిగౌడ్, ఎంపివో శ్రీనివాస్‌వర్మ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణం




శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, నవంబరు 12 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ సమీపంలో వెలసిన శ్రీకొండపోచమ్మ అమ్మవారి దేవాలయం 24వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం శివపార్వతుల కళ్యాణం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు హాజరై శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి వార్షికోత్సవ వేడుకలకు హాజరై కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అనుగీత, మాజీ సర్పంచ్ రజిత రమేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి రవికుమార్, ఆలయ డైరెక్టర్లు వెంకట్రాంరెడ్డి, గడ్డం రాజు, ఆశయ్య, నరేష్, పూజారులు గోవర్ధన్, లక్ష్మణ్, యాదగిరి, కొండయ్య, తిరుపతి, ఐలయ్య, రమేష్, నాయకులు నర్సింలు, స్వామి, లక్ష్మినరసింహారెడ్డి పాల్గొన్నారు.

## బాలికలకు సైకిళ్ల అందజేత

**దుబ్బాక, (అక్బర్‌పేట భూంపల్లి), నవంబర్ 12, ప్రభాతవార్త :** విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నీలం శ్రీనివాస్ ఆంగ్ల ఉపాధ్యాయులు కృషితో రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, సికింద్రాబాద్ లేడీస్ సర్కిల్ 17, ట్రైబ్ వాలా ఎలక్ట్రానిక్ లిమిటెడ్ అనే స్వచ్ఛంద సంస్థల ద్వారా రామేశ్వరంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు 44 సైకిల్లను వితరణ చేయడం జరిగింది. ఈ సమావేశానికి సిద్దిపేట జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా స్వచ్ఛంద సంస్థ బృందంలో పాల్గొనడం జరిగింది. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్యామల, అక్బర్‌పేట భూంపల్లి మండల తహసీల్దార్ ఆశజ్యోతి, ఎమ్ఈఓ అంజయ్యగౌడ్, ఉపాధ్యాయులుఇస్మాయిల్, మాదుగుల శ్రీనివాస్, రాజేశం, కురాకుల శ్రీనివాస్, అమృత్, నర్మద, మోనిక, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినర్ లక్ష్మయ్య, డీసిఈబి. అసిస్టెంట్ సెక్రటరీ వీరేశం, పిఎస్‌సిఎస్ చైర్మన్ కైలాసం, పూజారి మల్లేశం, సుదర్శన్, పరిసర ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# సంగాపూర్ రోడ్డులో వైన్‌షాప్ ఏర్పాటు చేయొద్దు

**గజ్వేల్, నవంబరు 12 (ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎడ్యుకేషన్‌హబ్, ఐఒసి కార్యాలయంతోపాటు యువకులు క్రీడలు ఆడుకునేందుకు మైదానం, దగ్గరలోనే సంతోషిమాత ఆలయం, ప్రతిరోజు ఉదయం,సాయంత్రం విద్యార్థుల రాకపోకలతోపాటు వర్గల్ కమాన్ నుండి సంగాపూర్ వరకు రోడ్డు ప్రతి నిత్యం ప్రజలు తిరిగే రోడ్డు మధ్యలో నూతనంగా వైన్‌షాప్ ఏర్పాటుకు పనులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న కాలనీవాసులు బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణతోపాటు ఎక్సైజ్ అధికారులకు వైన్స్ ఏర్పాటు చేయకూడదని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నిత్యం ప్రజలు సంచరించే ప్రదేశంలో వైన్‌షాపు ఏర్పాటుచేయడం సరైందికాదన్నారు. వైన్‌షాప్ పట్టణం శివారులో ఏర్పాటు చేసుకోవాలని, పట్టణం నడిమధ్యలో ఏర్పాటు చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఏర్పడతాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నిత్యం ఎడ్యుకేషన్ హబ్‌కు విద్యనభ్యసించేందుకు విద్యార్థినీ, విద్యార్థులు కాలినడకన వెళ్తారని, మధ్యలో వైన్‌షాప్ ఏర్పాటు చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, వెంటనే అధికారులు స్పందించి సంగాపూర్ రోడ్డులో వైన్‌షాప్ ఏర్పాటుచేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైన్‌షాప్ ఏర్పాటు చేస్తే మహిళలంతా కలిసి పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

## పేదోడి కలల సాకారం ఇందిరమ్మ ఇళ్ళు

### -ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, నవంబరు 12, ప్రభాతవార్త:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ స్కీంల పథకాలను ప్రవేశపెట్టి సమర్ధవంతంగా అమలు చేస్తుందని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళు పథకం ఎంతోమంది పేదల సొంతింటి కలను సాకారం చేస్తుందని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతిఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయాలనే ఆశయంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ళ పథకం ప్రవేశపెట్టారని ప్రభుత్వ ఆశయానుకనుగుణంగానే రాష్ట్రంలో ఇళ్ళ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని కొనియాడారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాలలో సమర్ధ వంతంగా ముందుకు సాగుతున్నాయని, అనేక సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఆమనగల్లు మండలంకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ పథకం లబ్ధిదారులకు బుధవారం పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డేన్స్ ఫంక్షన్ హాలులో ప్రొసిడింగ్‌లు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణాలతోపాటు పల్లె గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళు ఏకధాటిగా నిర్మాణం జరుపుకుంటున్నాయన్నారు. నిబంధనలు అనుసరించి నిర్మించు కుంటున్న ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారులకు ప్రతి సోమవారం బిల్లుల చెల్లింపు లను అవరోధం లేకుండా చెల్లిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం అనేక ఇండ్లు వందశాతం నిర్మాణాలు జరుపుకున్నాయని, వారికి ప్రభుత్వం సూచించిన విధంగా సకాలంలో బిల్లులు అందుతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైన వారు అలసత్వం చేయకుండా వేగవంతంగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. అనంతరం షాదిముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపాలిటి కమిషనర్ శంకర్‌నాయక్, ఎంపిడిఓ కుసుమ మాధురి, మార్కెట్ కమిటి చైర్మన్ యాటగీతనర్సింహ్మా, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటిసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాసరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు వస్పుల శ్రీశైలం, సంపత్ కుమార్, కండె పాండురంగయ్య, అంజయ్య, జంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెల్గమళ్ళ జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు గుర్రం కేశవులు, మండ్లి రాములు, కాలే మల్లయ్య, మెకానిక్ బాబా, విజయ్, విజయ్‌రాథోడ్, ఎంగలి ప్రసాద్, ఖాదర్, కిరణ్, అప్పం శ్రీను, ఫరీద్, వస్పుల శ్రీకాంత్, గుండ్రాతి కుమార్‌గౌడ్, అలీమ్, రూపం వెంకటరెడ్డి, అవ్వారి శివలింగం, మల్లేశ్‌నాయక్ పాల్గొన్నారు.

## చోరీ కేసులో నేరస్తుడికి 9 నెలల జైలు శిక్ష

**పరిగి, నవంబరు 12 ప్రభాతవార్త :** చోరీ కేసులో అరెస్టయిన వికారాబాద్ జిల్లా, దోమమండలం, బొంపల్లి పెద్ద తాండకి చెందిన నేనావత్ గణేష్‌కు బుధవారం కోర్టులో హాజరుపరుచగా పరిగి మెజిస్ట్రేట్ నాగుల శిల్ప నేరస్థుడికి 9నెలల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారని ఎస్ఐ మోహన కృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆగష్టు 5,2025న రాత్రి రాఘవపూర్ చౌరస్తాలో బోయిని రాములు శ్రీరామ టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. తన హోటల్ మూసి ఇంటికి వెళ్ళి, తిరిగి ఉదయం వచ్చి చూడగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు 11000/ రూపాయలు దొంగతనం చేశారని పరిగి పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా, 223/2025 గ్స్ట్ 331 (4), 305 తీవిళీ కింద కేసు నమోదు చేసి విచారణ చేయగా... నేనావత్ గణేష్ అను వ్యక్తిని కొడంగల్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అతన్ని విచారించగా నేరాన్ని అంగీకరించాడని ఎస్ఐ తెలిపారు. రిమాండ్‌కు పంపి, చార్జ్ షీట్ దాఖలు చేసి బుధవారం పరిగి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని, అతనికి 9 నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ఎస్ఐ బి.మోహన్ కృష్ణ, సమీనా బేగం ఏపీపిఓ, రమేష్ హెడ్ కానిస్టేబుల్ విచారణలో కృషి చేశారు.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

**పెద్దేముల్, నవంబరు 12, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రం లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో, మండల వనరుల కేంద్రంలో (యంఆర్‌సి) జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నింది తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ వేణుకుమార్ మాట్లాడుతూ పెద్దేముల్ గ్రామానికి చెందిన గౌడి శివకుమార్, బంటారం మండలం సల్బత్రాపూర్ గ్రామానికి చెందిన సమకొల్ల నాగరాజులు ఈ నెల 2వ తేది అర్ధరాత్రి 2 గంటల సమయంలోశ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలోని హుండిలో గల డబ్బులు సుమారు రూ.7600, రెండు నెలల క్రితం యంఈఓ కార్యాలయంలో ల్యాప్‌టాప్‌ను దొంగతనం చేసారని అన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న వారు బుదవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని కనకదుర్గ వైన్స్ సమీపంలో అనుమానస్పదంగా తిరుగు తుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరము ఒప్పుకున్నారని అన్నారు. ల్యాప్‌టాప్‌ను శివ ఒక్కడే దొంగతనం చేసినట్లు ఒప్పుకు న్నారని అన్నారు. ఈ రెండు కేసులలో వారి వద్ద నుంచి రూ. 8110లను స్వాదీనం చేసుకున్నామని, వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బానిస బతుకులు మాకొద్దు..!

### బర్క కృష్ణపై తిరుగుబాటు

**షాద్‌నగర్, నవంబరు 12 ప్రభాతవార్త :** సొంత జేబులోంచి డబ్బులు ఖర్చు పెట్టి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నాము.. ఎలాంటి స్వార్థం ఆలోచించకుండా తమ కుటుంబాలను పక్కనపెట్టి సంఘం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు కదులుతున్నాం.. కానీ సంఘంలో కొందరు తమను బానిసల్లా భావించి నియంతృత్వ పోకడలతో తమపై ఆజమాయిస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని బిసి సేన జిల్లా ఉపాధ్యక్షులు మేకల వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప, మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, మండల అధ్యక్షురాలు జక్కుల జలజ, ఉపాధ్యక్షురాలు స్రవంతి, నియోజకవర్గ యువజన అధ్యక్షులు పాలాది శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు తంగేడి పల్లి శంకర్ తదితరులు హెచ్చరించారు. బిసి సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ తీరుపై వారు తిరుగుబాటు జెండా ఎగరవేశారు. బుధవారం నియోజకవర్గ స్థాయిలో ముఖ్య నాయకుల అత్యవసరం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గడ్డమీది రమేష్ నియోజకవర్గ కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్ నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి సౌజన్య, వేలూరి వసంత, మమత, ఫరూక్ నగర్ మండల అధ్యక్షురాలు జక్కుల జలజ, ఉపాధ్యక్షురాలు స్రవంతి, బుజ్జమ్మ, సింధూర, అనిత, సరస్వతి, మీడియా ఇన్చార్జి నరసింహులు బాలమని తదితరులు పెద్ద ఎత్తున హాజరై బిసి సంఘం భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలను నియమ నిబంధనల ఏర్పాటు కోసమై అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో చర్చించిన అంశాలు తదితర ముఖ్య విషయాల అనంతరం మీడియాకు మేకల వెంకటేష్, కత్తి చంద్రశేఖర అప్ప స్రవంతి తదితరులు ప్రకటిస్తూ.. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను విమర్శించిన వారిపై తమ కండన చేస్తే జాతీయ బిసి సెల్ అధ్యక్షులు బర్క కృష్ణ నియోజకవర్గం కమిటీ సభ్యులను కొందరిని ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేస్తూ సోషల్ మీడియాలో వారి పేర్లను బహిర్గతం చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని బర్క కృష్ణ తీరును ఏకంగా తప్పుపట్టారు. బిసి సేన చిన్న మూలకం నుంచి ఒక వృక్షం వరకు తీసుకువచ్చిన వాళ్ళపైనే బెదిరింపులకు దిగితే ఎలా అని ప్రశ్నించారు. అన్ని పార్టీలు నాయకులను ముఖ్యంగా బిసి నాయకులను కలుపుకొని పోవాలని వాళ్లను గౌరవించాలని ప్రతి ఒక్క బిసి నాయకుని రాజకీయ అభివృద్ధికి సహకరించాలని కానీ కొందరు ప్రజాప్రతినిధులపై చేస్తున్న వ్యక్తిగత విమర్శలు తదితర వ్యతిరేక ప్రకటనలు సరికావనీ పేర్కొన్నారు. తప్పు చేసినవారిని మందలించాల్సిన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ వారిని వెనుక వేసుకోవచ్చి తప్పు చేయని తమపై ఉద్దేశం పూర్వకమైన ప్రకటనలు చేస్తూ సంఘం నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం దేనికి నిదర్శనమని అన్నారు. తప్పు చేసింది ఒకరైతే శిక్ష మరొకరికి ఇచ్చేలా జాతీయ అధ్యక్షులు భరత కృష్ణ వ్యవహార శైలి స్వార్థంగా ఉందని పేర్కొన్నారు. రాత్రింబవళ్లు బిజీ సేన అభ్యున్నతికి కృషి చేశామని ఎవరో కొందరి మాటలు నమ్ముకుని మెజార్టీ శాతం సభ్యులను దూరం పెట్టుకుంటే నష్టపోయేది బర్క కృష్ణ అని వారు హెచ్చరించారు. బర్క కృష్ణ హెచ్చరికలకు తాము భయపడే ప్రసక్తే లేదని వారు ప్రకటించారు. ఈ సమావేశానికి కొంతమంది ముఖ్యులు వచ్చారని మరి కొంతమంది కూడా త్వరలోనే కలుసుకొని వారికి అన్ని విషయాలు వివరిస్తామని బిసి సేన సంఘంలో ఏం జరుగుతుంది ఏం జరగబోతుంది సంఘాన్ని ఎలా కాపాడుకోవాలో తమకు కూడా తెలుసని తాము బీసీ బిడ్డలమని బిసి నినాదంతో సింహాలై గర్జించి బడుగు బలహీన వర్గ ప్రజలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

## ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

### యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రాములు

**దోమ, నవంబరు 12 ప్రభాతవార్త :** రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుదవారం దోమ మండల పరిధిలోని గుండాల్, దిర్సంపల్లి పాఠశాలలో టిఎస్ యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగులకు గ్రాటివిటి రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, బెనిఫిట్స్ రాక కొందరు ఇబ్బందులుపడి ఆత్మహత్యలు చేసు కుంటున్నారని విమర్శించారు. అలాగే సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్‌లీవులు, డిఎ బకాయిలు, జిపిఎఫ్ బకాయిలు, వెంటనే విడుదల చేయాలని తెలిపారు. పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్స్ డబ్బులు విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామి ఇచ్చారని ఇచ్చిన హామిలను తప్పక అమలు చేయాలని కోరారు. ఒకరికోసం అందరం అందరికోసం ఒకరం అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఎఫ్‌డబ్లుఎఫ్‌లో సభ్యులుగా చేరాలని అన్నారు. ఈ కార్యక్రమములో దోమ మండల అధ్యక్షులు వాసురాం, ప్రధానకార్యదర్శి జంగయ్య, జిల్లా నాయకులు రమేశ్, మేథ్యు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అందే శ్రీ మరణం తీరని లోటు

**నందిగామ, నవంబరు 12 ప్రభాతవార్త :** సహజ కవి అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటన్ని రంగారెడ్డి జిల్లా బీసీ సేన అధ్యక్షులు కేశమోని శ్రీనివాస్ యాదవ్ (సదర్ శ్రీను) అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన చేసిన సాహితి చైతన్యం వెలకట్టలేనిది అన్నారు. తెలంగాణ ప్రభుత్వ గీత రచయిత అయిన అందెశ్రీ రచనలు, కవిత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోతాయని అన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం అన్నారు. అందెశ్రీకి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు తో గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షులు సంపత్‌నాయక్

## వార్డెన్ నిర్లక్ష్యంతోనే చీకట్లో విద్యార్థులు

### బిజెపి మండల అధ్యక్షులు సంపత్‌నాయక్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 12,ప్రభాతవార్త** ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో వార్డెన్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు చీకట్లో ఉండా ల్సిన పరిస్థితి నెలకొందని బిజెపి మండల అధ్యక్షుడు భూక్య సంపత్‌నాయక్ మండిపడ్డారు. బుధ వారం వారం రోజులుగా విద్యుత్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న సంపత్ పార్టీశ్రేణులతో కలిసి వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారంరోజుల నుంచి హాస్టల్ లో విద్యుత్ లేని కారణంగా విద్యార్థులు కనీసం స్నానం చేయలేని దుర్భర స్థితిలో ఉన్నారని అన్నారు. ఈ విషయంపై వార్డెన్‌తో మాట్లాడితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. హాస్టల్‌లో విద్యుత్ సమస్యను పరిష్కరించాల్సిన అధికారులే పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులు పెట్టాల్సిన భోజనంలోనూ మెనూ పాటించడం లేదని ఈ విషయంలో డిటిడివో స్పందించి సమస్యను పరి ష్కరించాలని, లేని పక్షంలో విద్యార్థులతోకలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెల్దండి రాజేంద్రప్రసాద్, నాయకులు నునావత్ మోహన్‌నాయక్, బొల్లి సుధాకర్ పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల్లో అడ్డదారులు తొక్కిన అధికార పార్టీ

### బిఆర్ఎస్ నేత కళ్యాణ్‌కార్ నర్సింగరావు

**గజ్వేల్, నవంబరు 12 (ప్రభాతవార్త):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపు కోసం ఎన్నో అడ్డదారులు తొక్కిందని బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నాయకుడు కళ్యాణ్‌కార్ నర్సింగరావు పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా అడ్డదారుల్లో పోలీసులను ఉపయోగించుకొని దొంగ ఓట్లు వేయించారని ఆరోపించారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతగోపినాథ్ విజయం తథ్యమన్నారు. ప్రస్తుతం వస్తున్న సర్వేలు సైతం అధికార పార్టీకి అనుకూలంగా చేశారని, సర్వేలు అన్నీ పక్కనబెట్టి బిఆర్ఎస్ విజయ ఢంకా మోగిస్తుందని, సునీతను గెలిపించడం కోసం మాజీ మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్, ప్రశాంత్‌రెడితో పాటు పార్టీ సీనియర్ నాయకులు ఉప ఎన్నికల్లో కష్టపడ్డారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే విచ్చలవిడిగా నోట్లు పంచినట్లు ఆరోపించారు.

## పోలీసు ఠాణాను సందర్శించిన సిఐ

**నాగల్‌గిద్ద, నవంబరు 12, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పోలీసు ఠాణాను బుధవారం సిఐ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఠాణా పరిసరాలను, రికార్డులను సిఐ పరిశీలించారు పోలీసు సిబ్బందికి సిఐ పలు సూచనలు చేశారు. ఠాణాకు ధరఖాస్తులు చేసేందుకు వచ్చిన వారితో పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలన్నారు. పోలీసు ఠాణాలకు వచ్చే కేసులను ఎస్ఐ రామకృష్ణను సిఐ శ్రీనివాస్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

**చిన్నకోడూరు, నవంబరు 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మాచాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ ఏలేటి అరుణరాజారెడ్డి సహకారంతో క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్న శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాజుల బాబు, హెచ్ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూస్ పంపిణీ

**గజ్వేల్, నవంబరు 12 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం సింగాటం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు కీసరి జీవన్‌గౌడ్ బుధవారం షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సంతోష్ మాట్లాడుతూ సమాజం సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు బాగుపడతాయని, జీవన్‌గౌడ్ సొంత ఖర్చులతో విద్యార్థులకు షూస్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం జీవన్‌గౌడ్ మాట్లాడుతూ తన తండ్రి లక్ష్మణ్‌గౌడ్ మాకు చిన్నప్పుడు సూచించిన విధంగా తాను సంపాదించిన డబ్బు నుండి 10 శాతం సమాజ సేవకు ఉపయోగిస్తున్నానని, అందులో భాగంగానే ఈ రోజు మా గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుకునూరి శేఖర్, యశోద కృష్ణ, వసంత, రవీనా, గ్రామ ప్రజలు శ్రీనివాస్, సాయి, నజీరుద్దీన్, బషీరుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## హిమగిరి మిత్రబృందం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**గజ్వేల్, నవంబరు 12 (ప్రభాతవార్త):** హిమగిరి మిత్రబృందం ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్, వర్గల్ మండలాల పరిధిలోని నెంటూర్, కొడకండ్ల గ్రామాలకు చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు అమ్మాయిలకు ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. అలాగే వారి పిల్లల చదువుకు అవసరమయ్యే ఖర్చు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిమగిరి మిత్రబృందం సౌజన్య, మల్లికార్జున్‌లు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు తమవంతు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. హిమగిరి మిత్రబృందం ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలను చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బారు అరవింద్ పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**గజ్వేల్, నవంబరు 12 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన బోయిని పిడిచెడ్ కొండల్‌కు రూ.60వేలు, దూది యాదవ్వకు రూ.13వేల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను గజ్వేల్ మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తన నివాసం వద్ద లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చిన విధంగా సిఎంఆర్‌ఎఫ్ ఫండ్ మంజూరు కావడంలేదని, గత ప్రభుత్వంలో నిరుపేదలకు బాసటగా కెసిఆర్ నిలిచారన్నారు. రాష్ట్రంలో దొంగ హామీల తో రేవంత్‌రెడ్డి గద్దెనెక్కారని, ఎన్నికలముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మద్ది రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, అహ్మద్, నిజామొద్దీన్, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, ముత్యంగౌడ్, ప్రభాకర్, రాజ్ కుమార్, కరుణాకర్‌రెడ్డి, పోచయ్య, సింహం తదితరులు పాల్గొన్నారు.


**పత్రికా ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన శ్రీ సొప్పదండి లక్ష్మణ్ మరియు సొప్పదండి రవీందర్ పేరల తండ్రి సొప్పదండి రాజమల్లయ్య, మరియు శ్రీమతి సొప్పదండి నాగమణి, భర్త: హరిశ్చంద్ర నివాసం సిద్దిపేట్ గార్లకు సిద్దిపేట్ పట్టణం పటేల్‌పురా వీధియందు ఇంటి నం.4-2-61 మరియు 4-2-62 గల గృహములు ఒకే అసెస్‌మెంట్ నంబర్ 1113002498 పైన సిద్దిపేట్ మున్సిపాలిటీ యందు నమోదుగావించబడినవి. ఇట్టి అసెస్‌మెంట్ నుండి ఇంటి నం. 4-2-62 గల ఇంటిని తేది: 06.09.2025 రోజున శ్రీమతి సొప్పదండి నాగమణి, భర్త: హరిశ్చంద్ర గారి పేరున మున్సిపల్ రెవిన్యూ రికార్డులలో మార్పుగావించబడినది. ప్రస్తుతం నా క్లయింట్లు తేది: 30.10.2025 సిద్దిపేట్ మునిసిపాలిటీ యందు దరఖాస్తు సమర్పించి ఇంటి నం.4-2-61 గల గృహమును నా క్లయింట్లు అయిన సొప్పదండి లక్ష్మణ్ మరియు సొప్పదండి రవీందర్ గార్ల పేరున నమోదుచేయగలరని కోరియున్నారు. కావున ఇట్టి విషయంలో అనగా ఇంటి నంబర్ 4-2-61 గల ఇంటికి యజమానులుగా నా క్లయింట్లు అయిన సొప్పదండి లక్ష్మణ్ మరియు సొప్పదండి రవీందర్‌గార్ల పేరున నమోదు చేయుటకు ఎవరికైనా ఎలాంటి అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలో తగు సాక్ష్యాధార దస్తావేజులతో నాకు గాని నా క్లైంట్‌కు గాని లేదా సిద్దిపేట మున్సిపాలిటీ కార్యాలయం యందు గాని వారియొక్క అభ్యంతరములు సమర్పించి వారి యొక్క హక్కులను నిరూపించుకోగలరు. లేనియెడల నా క్లయింట్లు తాము నివసిస్తున్నటువంటి ఇంటి నంబర్ 4-2-61 ఉమ్మడి యజమానులుగా/హక్కుదారులుగా నమోదు గావించబడునని ఇట్టి పత్రికా ప్రకటన ద్వారా తెలుపనైనది.

సం/-. వి.సదానందం

న్యాయవాది, M.A., LLM.

తేది: 12.11.2025 కోర్టు కాంప్లెక్స్, సిద్దిపేట.

సిద్దిపేట సెల్ నం. 9705000192.


# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయండి

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 12, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు గడిపే మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించ దంతోపాటు మరిన్ని హామీలు ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా హామీలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమకారుల యొక్క త్యాగాలను వారుచేసిన కృషిని గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను సత్వరం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9 వరకు హామీల విషయంలో ప్రభుత్వం ప్రకటించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ మారస్వామి,శ్రీనివాస్ ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉత్తర తెలంగాణ మహిళా అధ్యక్షురాలు అయిలు ప్రసన్న బందారి కుమార్, జాగీర్ సత్యనారాయణ ఐలేని సంజీవ రెడ్డి, మహమ్మద్ అంకుశావలి, రమేష్‌రెడ్డి, అక్బర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర నాయకులు గడిపే మల్లేశ్**



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గడిపే మల్లేశ్ తదితరులు

## భక్తిశ్రద్ధలతో కాలభైరవ జయంతి ఉత్సవాలు

**రేగోడ్, నవంబరు 12, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన రేగోడ్‌లోని శ్రీబ్రహ్మంగారిమఠం ఆవరణలో కొలువై వున్న కాలభైరవస్వామిని జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్వామివారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి ఆలయ అర్చకులు శివకుమార్ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి జ్వాలాతోరణం కార్యక్రమం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉత్సవాలకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మంగారి కమిటీ సభ్యులు పూర్ణ చందర్, శివాజీపాటిల్, గొల్ల వీరేశం, వడ్డేపల్లి శివ, అవుసలి చెన్నప్ప, వడ్ల సత్యం, ముప్పారం ఆంజనేయులు, అవుసలి రమేష్, శంకరంపేట విజయ్, వనపర్తి శ్రీనివాస్, దత్తు, బ్రహ్మంగారి శిష్యబృందం గడిల నర్సింలు, కురుమ మల్లయ్య, జేజమ్మల రామాగౌడ్, సోయిన లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మీర్జాపూర్ విద్యార్థి శేషు


పోటీలకు ఎంపికైన విద్యార్థి శేషును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**న్యాల్‌కల్, నవంబరు 12, ప్రభాతవార్త:**
టి-సాట్, టిఎస్‌జిహెచ్‌ఎంఎ సంయుక్తంగా జిల్లాకేంద్రమైన సంగారెడ్డిలోని సైన్స్‌సెంటర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో మండలపరిధిలోని మీర్జాపూర్(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 10వ తరగతిలో విద్యను అందుకుంటున్న సి.శేషు ప్రథమస్థానాన్ని దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి శేషును పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

## బాల్యవివాహాలపై అవగాహన



పెద్దశంకరంపేటలో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న అధికారులు

**పెద్దశంకరంపేట, నవంబరు 12, ప్రభాతవార్త:**
బాల్యవివాహాల నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ షాకీర్‌అలీ, అల్లాదుర్గం సిడిపిఓ పద్మలత, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, జిల్లా బాలలసంరక్షణ అధికారి నాగరాజు అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాలలపరిరక్షణ, బాలకార్మికుల నిర్మూలన చట్టాలపై అవగాహన తప్పనిసరన్నారు. ప్రతి బడి ఈడు విద్యార్థి బడిలో ఉండేలా చూడాలన్నారు. షీటీం ద్వారా ఈవ్‌టీజింగ్‌ను నిర్మూలిస్తామని, విద్యార్థినులు, ఉద్యోగులు ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, వైద్యాధికారి షఫీయుద్దీన్, సఖీకేంద్ర సిబ్బంది కళావతి, మహిళా సాధికారత సిబ్బంది నాగమణి, సూపర్వైజర్లు పుష్పలత, శ్రీశైల, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రంచేసిన యువసేన బాధ్యులు


పాఠశాల ప్రాంగణంలో స్టోన్ చిప్స్ చేస్తున్న యువసేన బాధ్యులు

**పెద్దశంకరంపేట, నవంబరు 12, ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేటలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పాఠశాల ప్రాంగణాన్ని మురళిపంతులు యువసేనబాధ్యులు పరిశుభ్రంచేశారు. బుధవారం పాఠశాలలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించడంతోపాటు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని మురళిపంతులు యువసేన స్వచ్ఛందంగా ముందుకువచ్చి పాఠశాల ప్రాంగణంలో స్టోన్ చిప్స్ వేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చేశారు. దీంతోపాటు పరిసర ప్రాంతాలలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. సేవాభావంతో మురళిపంతులు యువసేన చేసిన కార్యక్రమాలకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## ఆర్థోపెడిక్ డాక్టర్‌కు సన్మానం


సన్మానం చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

**కంగ్టి, నవంబరు 12, ప్రభాతవార్త:**
మండల కేంద్రం అయిన కంగ్టిలో బుధవారం ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్‌ను నిర్వహించిన రాధా క్లినిక్ డాక్టర్లకు మండలం మాజీ ఎంపిపి సంగీత వెంకట్‌రెడ్డి సన్మానంచేశారు. వారు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతంలో క్యాంప్ ఏర్పాటుచేయడం సంతోషం అని, ప్రతి ఒక్క పేషెంట్‌కు టెస్ట్ నిర్వహించి మాత్రలు ఇవ్వడం శుభపరిణామం అని తెలిపారు. కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్ డాక్టర్ మోహన్‌కుమార్, అలాగే రాధా క్లినిక్ డాక్టర్ రాథోడ్ నెహ్రూనాయక్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మనోజ్ పటేల్, ఆయాగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పూర్ణకుంభ ఆకృతిలో దీపాలంకరణ

**వర్గల్, నవంబరు 12, ప్రభాతవార్త:**
వర్గల్ మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని బుధవారం ఆలయప్రాంగణంలో పూర్ణకుంభ ఆకృతిలో భక్తులు దీపాలంకరణతోపాటు ఆకాశదీపారాధన చేయడం జరిగింది. వివిధప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు ఉదయాన్నే హరిద్రానదిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను జరిపించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

### -సెయింట్ మేరీస్ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించిన నర్సారెడ్డి


మాట్లాడుతున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, నవంబరు 12, ప్రభాతవార్త:**
విద్యతోపాటు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ ఉన్నతపాఠశాల 25వ వార్షికోత్సవం పూర్తిచేసుకున్న సందర్భంగా సెయింట్ మేరీస్ పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రైవేట్‌పాఠశాలల విద్యార్థులతో క్రీడాపోటీలు నిర్వహించగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెయింట్ మేరీస్ పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి నిర్విరామంగా గత 25 సంవత్సరాలనుండి పాఠశాలను నడుపుతూ విద్యార్థినీవిద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు. మహిళా క్రికెట్ క్రీడాకారులను దేశం ఎంతో గౌరవిస్తుందని, మహిళలు క్రికెట్ ఆడి దేశానికి ఎంతోపేరు తీసుకువచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి గజ్వేల్ పేరును రాష్ట్రస్థాయిలో నిలిపేవిధంగా చేయాలన్నారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమకవి అందెశ్రీ రెండు రోజులక్రితం మృతిచెందగా ఆయనకు నివాళులర్పించి సంతాపం తెలిపారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ మా పాఠశాల ప్రారంభించి 25సంవత్సరాలు గడుస్తున్నందున గజ్వేల్ పట్టణంలో ఉన్న 18 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో క్రీడాపోటీలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రెండురోజులపాటు ఈక్రీడలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో సెయింట్ మేరీస్ పాఠశాల నిర్వాహకులు యాదవరెడ్డి, థామస్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, కొండ పోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు శివులు, ప్రైవేట్ పాఠశాలల జిల్లా కార్యదర్శి సోమేశ్వర్‌రెడ్డితోపాటు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదవాలి

### -జోగిపేట మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్

**జోగిపేట, నవంబరు 12, ప్రభాతవార్త:**
విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని జోగిపేట మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. బుధవారం జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని అందోలు కస్తూర్బా బాలికల పాఠశాలలో మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతసమాజంలో విద్యార్థులు చట్టాల పైకూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపట్ల అవగాహన పెంచుకుంటేనే తమతమపరిధిలో గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే అవసరమైన సహాయం చేయగలుగుతారని పేర్కొన్నారు. అందరికీ సమాన న్యాయం అందించాలనే సదుద్దేశంతో లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయసేవలు అందించటం జరుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు సార వెంకటేశం, నవీన్, షా నవాజ్ ఆలి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఉచిత న్యాయకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### -సెర్ఫ్ జెండర్ విభాగం అడ్వైజర్ జమున


ఉచిత న్యాయసలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జమున

**ఝరాసంగం, నవంబరు 12, ప్రభాతవార్త:**
మహిళలు ఉచిత న్యాయసలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెర్ఫ్ జెండర్ విభాగం అడ్వైజర్ జమున అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పేదరికనిర్మూలన సంస్థ కార్యాలయ కమ్యూనిటీ నిర్వాహణలో ఉచిత న్యాయసలహా కేంద్రాన్ని జమున ప్రారంభించి మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. నిత్యం మహిళలు ఇతరులకు చెప్పుకోలేని సమస్యలతో అవస్థలు పడుతూ ఉంటారని, సదరు మహిళలు నేరుగా ఉచిత న్యాయసలహా కేంద్రానికి చేరుకుని తమ సమస్యలను సూచిస్తూ పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెండర్ విభాగం రాష్ట్ర అధికారి జాన్, ఎపిఎం హెచ్‌డి వెంకట్, ఎపిఎం భాగయ్య, మండలసమాఖ్య అధ్యక్షురాలు మమత, కార్యదర్శి సంగీత, కోశాధికారి మమత బెనర్జీ, సిసిలు, సోషల్ ఆక్టివిటీ సభ్యులు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మీట్ మార్కెట్ నిర్మాణానికి స్థలపరిశీలన


మార్కెట్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, నవంబరు 12, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రాపురంలో నూతనంగా మీట్ మార్కెట్ నిర్మాణానికి బుధవారం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేతులమీదుగా మార్కెట్‌నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. మీట్ మార్కెట్ స్థలం పక్కన ఉన్న బస్తీలో ఓపెన్ డ్రైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, సిసి రోడ్డులు అవసరమని బస్తీవాసులు కార్పొరేటర్ దృష్టికి తేగా, స్పందించిన కార్పొరేటర్ పుష్పనగేష్ సంబంధిత ఇంజనీరింగ్, జల మండలి అధికారులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు ఉన్నారు.

## సన్నవడ్లకు బోనస్ వెంటనే చెల్లించాలి

### -బిజెపి నాయకులు కోణం విఠల్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**పెద్దశంకరంపేట, నవంబరు 12, ప్రభాతవార్త:**
రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన సన్న వడ్లకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ వెంటనే చెల్లించాలని మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులు సన్నవడ్లు పండిస్తే 500రూపాయలు బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు రెండుపంటలు పండించినవారికి రూ.500 బోనస్ చెల్లించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రబీ సీజన్లో పండించిన పంటలకు గిట్టుబాటుధర కల్పించడంతోపాటు సన్నవడ్లకు రూ.500 బోనసును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్. మండల ప్రధానకార్యదర్శి ఎం.కృష్ణ, బిజెవైఎం మండల అధ్యక్షుడు బొగుడాల కృష్ణ, మండల బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం

**వర్గల్, నవంబరు 12, ప్రభాతవార్త:**
జవహర్ నవోదయ విద్యాలయ వర్గల్‌లో జాతీయ విద్యాదినోత్సవాన్ని విద్యాలయ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ జె.నాగభాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇంచార్జ్ ప్రిన్సిపాల్ నాగభాస్కర్, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు సిఎంవి.శేషులు మాట్లాడుతూ, మనదేశంలో విద్యావిధానము ఎంతో ఉన్నతిచెందడానికి పునాదులువేసింది మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర బృందంతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాల నివారణ అందరి బాధ్యత

### -డిడబ్ల్యుఓ హేమ భార్గవి


బాల్యవివాహాల నిర్మూలన సదస్సులో ప్రసంగిస్తున్న డిడబ్ల్యుఓ హేమభార్గవి తదితరులు

**నర్సాపూర్, నవంబరు 12, ప్రభాతవార్త:**
బాల్యవివాహాలు జరగకుండా గ్రామాల్లోని ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని జిల్లా మహిళ, శిశు సంక్షేమ అధికారిణి హేమభార్గవి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన పిల్లల అభివృద్ధిపై అధికారులకు ఒకరోజు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి హేమభార్గవి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగితే అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులదే బాధ్యతని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు జరగకుండాచూసి మెదక్‌జిల్లాను బాల్యవివాహాలు జరగని జిల్లాగా మార్చాలని ఆమె సూచించారు. పిల్లలందరూ బడిలో ఉండాలని కోరుకుంటూ పిల్లల చేత పనిచేయించడం నేరం అని ఆమె గుర్తు చేశారు. కిశోర బాలికల సమాచారాన్ని వారు సేకరించాలని ఆమె తెలిపారు. అనంతరం ఎంపిడివో మధులత మాట్లాడుతూ గ్రామాల్లో తండాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సహకరించాలని ఆమె అన్నారు. చట్టాలపై గ్రామస్థాయిలో విసిపిసి ద్వారా అవగాహన కల్పించాలని అదేవిధంగా పాఠశాలల్లో కూడా అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. ఈసందర్భంగా బాల్యవివాహాలను నిర్మూలిస్తామని అందరి అధికారుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, మండల రెవెన్యూ అధికారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సరళకుమారి, కవిత, లక్ష్మి నర్సమ్మ, మెడికల్ ఆఫీసర్, ఐకెపి, అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీ కార్యదర్శులు, సఖి, ఐసిపిఎస్, హబ్ అధికారులతోపాటు ఎన్జీవోప్రతినిధులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్వెట్టర్లు అందచేసిన వార్డెన్

**మనూర్, నవంబరు 12, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మనూర్‌లోని బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు చలికాలాన్ని దృష్టిలోపెట్టుకుని బుధవారం వార్డెన్ రాజిరెడ్డి విద్యార్థులకు స్వెట్టర్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వార్డెన్ రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకుంటే ఉన్నతశిఖరాలకు చేరుకోవడం తథ్యమన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశయాలను నెరవేర్చేలా ఇష్టపడుతూ విద్యను అందుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అంబోజి, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**నర్సాపూర్, నవంబరు 12, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నర్సాపూర్ లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని దాత లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు ఆధ్వర్యంలో ప్రతివారం ఈ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈమేరకు మొట్టమొదటిసారిగా ఈ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. రోగుల సౌకర్యార్థం ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాఘవేంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మణికొండ రాఘవేంద్రరావుతోపాటు కార్యదర్శి నల్లగొండ అశోక్‌కుమార్, క్లబ్ కోశాధికారి వెంకట్‌స్వామిగౌడు, మాజీ అధ్యక్షులు జైపాల్, ఉపాధ్యక్షులు లవంగు శ్రీనివాస్, మాణిక్యంగౌడ్, సుధాకర్, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే వృద్ధురాలి మెడలోనుంచి నాలుగుతులాల పుస్తెలతాడు చోరీ

**జోగిపేట, నవంబరు 12, ప్రభాతవార్త:**
ఓ వృద్ధురాలి కంట్లో కారంపొడి చల్లి, ఆమె మెడలోనుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన సంఘటన జోగిపేటలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శంకరంపేట మాణెమ్మ అనే వృద్ధురాలు జోగిపేటలోని సత్యసాయికాలనీలో తనకూతురు ఇంట్లో నివాసం ఉంటుంది. తల్లీ కూతుర్లు ఇంట్లో ఉన్న సమయంలోనే, మధ్యాహ్న సమయంలో ఓ వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి మాణెమ్మ కంట్లో కారంచల్లి పుస్తెలతాడు లాక్కెళ్లాడు. ఈసమయంలో వృద్ధురాలి కూతురు ఆదుండగుడిని అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, అతను వారినుంచి తప్పించుకొని పారిపోయాడు. ఈవిషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా జోగిపేట సిఐ అనిల్‌కుమార్, ఎస్ఐ పాండులు చోరీ జరిగిన ఇంటికి చేరుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఈమేరకు అక్కడ ఉన్న సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఏది ఏమైనా జోగిపేటలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు జోగిపేటలో మరింత పటిష్ఠంగా పెట్రోలింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు

### -గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ మురళి

**గజ్వేల్ టౌన్, నవంబరు 12, ప్రభాతవార్త:**
మానవతప్పిదం వల్లే రోడ్డుప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రోడ్డుప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, చట్టప్రకారం నేరమని అన్నారు. మైనర్లు ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు నడపవద్దని తెలిపారు. కారణంలేని మరణం ఒక రోడ్డుప్రమాదం మాత్రమేనని, నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగవని అన్నారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా, జైలుశిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎఎస్ఐ జగదీశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### -ఎస్పై సత్యనారాయణ

**కొడంగల్, నవంబరు 12, ప్రభాతవార్త:**
ఈనెల 15న నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పై జివి.సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గంగా ఇరువురి రాజీమేరకు లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. క్షణికావేశంతో తప్పులుచేసి కోర్టులచుట్టూ తిరగటంకంటే ఇద్దరూకలిసి రాజీకివస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. న్యాయవ్యవస్థ అధికారుల ఆధ్వర్యంలో కేసులు రాజీ చేయనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో పాత కేసులకు సంబంధించి ఇరువురు రాజీ అయ్యేందుకు ఆస్కారం ఉంటుందని ఎస్పై సత్యనారాయణ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 12, ప్రభాతవార్త:**
రోడ్డుప్రమాదంలో గాయపడిన మోటార్‌బైకిస్టు చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన పోచారం ఐటి కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సంఘటన వివరాలు స్థానికపోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. పోచారం మున్సిపల్ కొర్రెముల గ్రామంలోని గ్రీన్‌ల్యాండ్ అపార్టుమెంటులో ఎ.శ్రీనిధి(32) తనభార్య, కూతురుతో కలిసి నివాసం ఉంటున్నాడు. తన భార్య సుభాషిణి, కూతురుతోకలిసి వరంగల్‌లోని తల్లిగారింటికి వెళ్లింది. ఈనెల 8వతేదిన మృతుడు శ్రీనిధి తననివాసం నుండి డ్యూటీనిమిత్తం మోటార్‌సైకిలుపై వెళ్తుండగా కొర్రెముల కమాన్‌వద్ద అకస్మాత్తుగా గేదె అడ్డంరాగా మోటార్‌సైకిలు ఢీ కొట్టింది. దీంతో మోటార్‌సైకిలిస్టు శ్రీనిధి తలకు తీవ్రంగా గాయాలైనాయి. దీంతో స్థానికులు చికిత్సనిమిత్తం ఉప్పల్‌లోని శ్రీకర్ ఆస్పత్రికి అక్కడినుండి మలక్‌పేట్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడినుండి ఈనెల పదవ తేదీన నిమ్స్ ఆస్పత్రికి తరలించగా, ఈనెల 11వ తేదీన చికిత్సపొందుతూ బాధితుడు శ్రీనిధి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడిభార్య సుభాషిణి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.కృష్ణయ్య తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

### -మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్

**కొడంగల్, నవంబరు 12, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనాన్ని మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. భోజనంలో నాణ్యమైనబియ్యం, కూరగాయలతో వడ్డించాలని వంట ఏజన్సీ నిర్వాహకులకు సూచించారు.

## ప్రభుత్వ మద్దతు ధరను వినియోగించండి

**యాచారం, నవంబరు 12, ప్రభాతవార్త:** యాచారం మండలపరిధిలోని చింతపట్ల, నందివనపర్తి, యాచారం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపిడిఓ రాధారాణి, పిఎసిఎస్ జిల్లాచైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఇబ్రహీంపట్నం ఏఎంసి చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి కలిసి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ప్రభుత్వం రైతుకు మద్దతుధర అందిస్తుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.